సాక్షి
జగిత్యాల
బుధవారం, 6, ఆగస్టు, 2025



విష్ణు సహస్ర పారాయణం

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శేషప్ప కళావేదికపై శ్రావణమాసం సందర్భంగా స్థానిక మహిళా మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు.



యూరియా కోసం బారులు

పెగడపల్లి: పెగడపల్లి సొసైటీకి మంగళవారం కేవలం 300 బస్తాలు మాత్రమే వచ్చింది. ఏవో శ్రీకాంత్ ఎకరాకు బస్తా చొప్పున అందించారు. సరిపడా యూరియా ఇవ్వాలని రైతులు కోరారు.

గరిష్టం/కనిష్టం
34.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

తల్లిపాల ప్రాముఖ్యత వివరించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

మల్లాపూర్: తల్లిపాలు బిడ్డకు సురక్షితమని, వాటి ప్రాముఖ్యతను వివరించాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో సమావేశమయ్యారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, ఈ విషయాన్ని బాలింతలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. అలాగే డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా చూడాలని సూచించారు.

నిలిచిన ఇళ్లకు నిధులివ్వండి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: నూకపల్లి అర్బన్ కాలనీలో వివిధ దశల్లో నిలిచిపోయిన 1611 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.52కోట్లు మంజూరు చేయాలని మాజీమంత్రి జీవన్ రెడ్డి సీఎంను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నూకపల్లిలో ఇందిరమ్మకాలనీ పేరిట 4వేల మందికి ఇళ్లు మంజూరు చేసిందని, 80గజాల స్థలంలో పట్టాలు పంపిణీ చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం రెండువేల ఇళ్లను కూల్చివేయించిందని, మిగిలిన 1611 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, వాటి నిర్మాణానికి రూ.52కోట్లు అవసరమని వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలి



వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. మంగళవారం వైద్యాధికారులతో సమీక్షించారు. జిల్లాలో పిల్లలు 2,22,950 మంది ఉన్నారని, వారి కోసం 2,175 కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని అంగన్‌వాడీకేంద్రాలు, ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాత్రలు వేయాలని సూచించారు. ఆగస్టు 11న వేసే ఈ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని, తిరిగి 18న మరోసారి మాత్రలు పంపిణీ చేస్తామని వివరించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, అర్చన, నరేశ్, నారాయణ, సుమన్, చైతన్యసుధ పాల్గొన్నారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదురోజుల్లో జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీ లక్ష్మి తెలిపారు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల సెల్సియస్‌గా.. రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

బస్సులను జాగ్రత్తగా నడపాలి




శిక్షణలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది

జగిత్యాలటౌన్: ఆర్టీసీ బస్ డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని, తమ కుటుంబాలతోపాటు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జగిత్యాల డిపోలో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. రివర్స్ తీసుకునే సమయంలో కండక్టర్ సూచనలు పాటించాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌పై అవగాహన కల్పించారు. డీఎం కల్పన మాట్లాడుతూ సంస్థ నమ్మకాన్ని మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. డిపో ఏఈఎం కవిత, సేఫ్టీ వార్డెన్ ఎస్‌జె.రెడ్డి పాల్గొన్నారు.

మనవద్దా 'సృష్టి' కేంద్రాలు..!

- నిబంధనలు పాటించని సంతాన సాఫల్య కేంద్రాలు
- జిల్లావ్యాప్తంగా సుమారు పది వరకు నిర్వహణ
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- తాజాగా తనిఖీలకు ప్రత్యేక బృందాలు





జగిత్యాల: ఒకప్పుడు హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే పరిమితమైన సంతాన సాఫల్య కేంద్రాలు.. ప్రస్తుతం జిల్లాలకూ విస్తరించాయి. ఒకటికాదు.. రెండుకాదు.. విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అనుమతులు లేకుండానే ప్రతిచోట ఫెర్టిలిటీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలు ఎక్కడా నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. సికింద్రాబాద్‌లో సృష్టి సరోగసి కేంద్రంలో జరిగిన మోసంతో జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. కలెక్టర్ సత్యప్రసాద్ కూడా ప్రత్యేక దృష్టిసారించారు. మరోవైపు ప్రభుత్వం కూడా ముగ్గురు సభ్యులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేయగా.. జిల్లాలోనూ బృందాలను నియమిస్తున్నట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం ఫెర్టిలిటీ సెంటర్‌లో అన్ని వసతులు కల్పించడంతోపాటు డీఎంఏ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో ప్రభుత్వ అనుమతితో నాలుగు ఫెర్టిలిటీ కేంద్రాలు నడుస్తున్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి కాకుండా అనధికారికంగా పది వరకు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు నేరుగానే ఫెర్టిలిటీ సెంటర్‌గా పేరు పెట్టుకుని చికిత్స చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పేదలే టార్గెట్

కొన్ని ఫెర్టిలిటీ కేంద్రాలు ఆర్థికంగా లేని మహిళలను టార్గెట్ చేసుకుంటున్నారు. వారికి ఎంతోకొంత ముట్టజెప్పి వారి అండాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం కొన్ని కేంద్రాలు పీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారంటే అతిశయోక్తికాదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళల వద్దకు కొందరు నిర్వాహకులు వెళ్లి వారిని ఫెర్టిలిటీ సెంటర్లకు తీసుకొచ్చి అండాలు విక్రయించుకునేలా చేస్తున్నట్లు తెలిసింది.

అమ్మ కోసమే..

చాలామంది దంపతులకు కొన్ని కారణాలతో సంతానం కలగకపోవడంతో ఈ ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు మధ్యవర్తులు ఆశ్రయిస్తున్నారు. వారు ఇదే అదునుగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఫెర్టిలిటీ కేంద్రాలు నియమించుకున్న పీఆర్వోలతో ఈ దందా నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. చికిత్స కోసం వచ్చిన దంపతులకు ఫెర్టిలిటీ సెంటర్లలో రెండు రకాల చికిత్సలు చేస్తారు. దంపతులను పరీక్షించి వారిలో ఉన్న లోపం గుర్తించి వీర్యకణాలు, అండాలు సేకరించి చికిత్స చేస్తుంటారు. ఇందులో ఒకటి ఇంట్రాయుటెరైన్ ఇన్ సెమినేషన్ (ఐయూఐ), రెండోది ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్). ఇది దంపతుల అంగీకారంతోనే చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు వీటిని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతర దాతల నుంచి సేకరించిన వీర్యకణాలు, అండాలను ప్రవేశపెట్టి సంతానం కలిగేలా చికిత్స చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లపై కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేయాలని ఇప్పటికే వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో అనుమతి ఉన్న కేంద్రాలు ఎన్ని..? లేనివి ఎన్ని..? నిబంధనల ప్రకారం ఉన్నాయా..? లేవా..? పూర్తిస్థాయిలో సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు వైద్య శాఖ అధికారులు కూడా ఈ ఫెర్టిలిటీ సెంటర్లపై దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది.

జిల్లాలో నాలుగు సెంటర్లు



జిల్లాలో ఫెర్టిలిటీ సెంటర్లు నాలుగు ఉన్నాయి. ఎవరైనా నేరుగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతాం. అనుమతులు డీఎంఏ నుంచే తీసుకోవాల్సి ఉంటుంది.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

అనుమతి లేకుంటే చర్యలు



నిబంధనలు అతిక్రమిస్తే ఫెర్టిలిటీ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. తనిఖీలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించాం. బాధితులెవరైనా ఉంటే సమాచారం ఇవ్వొచ్చు. కేంద్రాలు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. అనుమతి లేకుంటే సీజ్ చేస్తాం.

– సత్యప్రసాద్, కలెక్టర్

వసతుల్లేని గోదావరి



ధర్మపురి గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

- పుణ్యస్నానాలకు భక్తుల ఇబ్బందులు
- పుష్కరఘాట్ల వద్ద నామమాత్రంగా ఏర్పాట్లు
- ఆదాయమున్నా.. వసతుల కల్పనలో నిర్లక్ష్యం

ధర్మపురి: గోదావరిలో పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. ఫలితంగా మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు కనీసం తాత్కాలిక షెడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. స్నానాలకోసం వచ్చే భక్తులకు గోదావరిలో నీడ సౌకర్యం కల్పించడంతోపాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లు తప్పనిసరి. కానీ.. వాటిని ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. భక్తుల ద్వారా నృసింహస్వామి ఆలయం, మున్సిపాలిటీకి ప్రతిరోజూ భారీగానే ఆదాయం సమకూరుతోంది. కానీ.. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో మాత్రం అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు అంటున్నారు. ఏ పుణ్యక్షేత్రంలో చూసినా భక్తులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ ధర్మపురి పుణ్యక్షేత్రంలో మాత్రం భక్తులు వసతులకు నోచుకోలేకపోతున్నారు.

శ్రావణంలో భక్తుల రద్దీ

దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన ధర్మపురి వద్ద గోదావరితోపాటు, శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాలున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా శ్రావణమాసం సందర్భంగా నెలరోజుల పాటు గోదావరి, దేవాలయాలు కిక్కిరిసి పోతాయి. పుణ్యస్నానాలు, దైవదర్శనం కోసం వచ్చే భక్తులు ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం లక్ష్మీనృసింహస్వాములను దర్శించుకుంటారు.



నిరుపయోగంగా కనిపిస్తున్న మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు

కనిపించని వసతులు

శ్రావణమాసం సందర్భంగా నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. గోదావరిలో స్నానాలు చేసిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకుంటారు. అలాంటి వసతులు గోదావరిలో ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు బట్టలు మార్చుకునేందుకు రాళ్ల రప్పలు, ముళ్ల పొదలను ఆశ్రయించాల్సి వస్తోంది.

నిరుపయోగంగా షెడ్లు

గోదావరిలో కనీసం తాత్కాలిక షెడ్లనైనా ఏర్పాటు చేయాలని భక్తులు అంటున్నారు. కొందరు స్నానాల కోసం నది దాటి వెళ్తున్నారు. అక్కడ వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మంగలిగడ్డ వద్ద గతంలో ఏర్పాటు చేసిన పుష్కరఘాట్ల వద్ద 2, 3 షెడ్లు మాత్రమే ఉన్నాయి. వాటి పైకప్పులు గాలికి లేచిపోవడంతో నామమాత్రంగా కవర్ కప్పారు. అయితే ఆ పుష్కరఘాటు వద్ద నీరు లేకపోవడంతో భక్తులు స్నానాల కోసం ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఫలితంగా ఆ షెడ్లు నిరుపయోగంగా మారాయి. భక్తులున్న చోట వసతులు కల్పిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

గోదావరిలో అపరిశుభ్రత



చెత్తాచెదారం పేరుకుపోయి గోదావరి అపరిశుభ్రంగా మారింది. కొందరు భక్తులు దేవుళ్ల ఫొటోలు, ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు ఇతరత్రా వస్తువులతో చెత్తమయమైంది.

– తిరుమల, భక్తురాలు

వసతులు కల్పిస్తాం



ధర్మపురికి వచ్చే భక్తులకు గోదావరిలో ఏర్పాట్లు చేయడానికి చర్యలు చేపడుతున్నం. ఇక్కడి ఏర్పాట్లపై దేవాదాయశాఖ దృష్టికి తీసుకెళ్లాను. కలెక్టర్‌తో మాట్లాడి వసతులకు కృషి చేస్తాం.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి

కనీస వసతులు లేవు



గోదావరిలో స్నానాలు చేసే చోట వసతులు కల్పించాలి. ఎక్కడో పుష్కరఘాట్ల వద్ద ఉంటే అక్కడికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నం. అధికారులు వసతులు కల్పించాలి.

– అమ్మాయి, భక్తురాలు

తాత్కాలిక షెడ్లు వేస్తాం



గోదావరిలో స్నానాలకు వచ్చే భక్తులకు పుష్కరఘాట్ల వద్ద ఏర్పాటు చేసినం. గతంలో ఏర్పాటు చేసిన షెడ్డు వరదలతో కొట్టుకుపోయాయి. వాటి స్థానంలో తిరిగి కొత్త షెడ్లు ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాస్, ఆలయ ఈవో

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. మందులు ఉన్నాయా..? లేదా..? తెలుసుకున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరికీ తప్పనిసరిగా పరీక్షలు చేయాలని, రోగి లక్షణాలు రికార్డు చేయాలని సూచించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్, మండల వైద్యాధికారి వాహిని, తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, సీహెచ్‌వో రామ్మోహన్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే పరిష్కరించాలి

భూసమస్యలు, ఇతరత్రా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం మాట్లాడారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఈనెల 14లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

పీఏసీఎస్‌ల తనిఖీ



రిజిస్టర్లు పరిశీలిస్తున్న అధికారి

కొడిమ్యాల: మండలంలోని పూడూరు, తిర్మలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను జిల్లా సహకార అధికారి సీహెచ్.మనోజ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల విక్రయాలను పరిశీలించారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు ఉంటేనే రైతులకు యూరియా పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఏ.మల్లేశం, కె.నాగసంకీర్త్, కార్యదర్శులు రాజేందర్ రెడ్డి, ఖుర్షిద్ తదితరులు ఉన్నారు.

సోలార్ విద్యుత్ సబ్సిడీని వినియోగించుకోండి

- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం

మెట్‌పల్లి: సోలార్ విద్యుత్‌కు అవసరమైన పరికరాలను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం తెలిపారు. సోలార్ ఇంధన వనరుల ఆవశ్యకతపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. థర్మల్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి జరుగుతోందని, తద్వారా వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతోపాటు మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్రం పీఎం సూర్యఘర్ యోజన, పీఎం కుసుమ్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దీనికింద సోలార్ పరికరాలను సబ్సిడీపై అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులు వెలిబుచ్చిన పలు సందేహాలను కంపెనీ ప్రతినిధి బండి ప్రవీణ్ నివృత్తి చేశారు. డీఈ మధుసూదన్, ఏడీఏ మనోహర్ తదితరులున్నారు.



పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

అంజన్న ఆలయానికి దాతల విరాళం

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు ఆర్మూర్‌కు చెందిన జమ్మలగిరి విరాటమ్మ, గంగారాం దంపతులు రూ.3.60లక్షల విలువైన వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌ను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసి ఆలయ అధికారులకు అప్పగించారు. అలాగే బేతాళస్వామి ఆలయం వద్ద కూడా మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌కు చెందిన మరో దాత బండారి మారుతి కొండగట్టులో నిత్యం 100మందికి అన్నదానం అందించే సరుకులను ఏడాదిపాటు అందిస్తానని హామీ ఇచ్చారని ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సంగీతం

- పీఎంశ్రీ స్కూళ్లకు చేరిన వాయిద్య పరికరాలు
- వారానికో తరగతి చొప్పున నిర్వహణ
- శిక్షకుల నియామకానికి కమిటీ ఏర్పాటు
- జిల్లాలో పది పాఠశాలల ఎంపిక



గొల్లపల్లి మోడల్‌స్కూల్‌లో సంగీత పరికరాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్న ప్రిన్సిపల్ రవి

గొల్లపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు, వారి సర్వతోముఖాభివృద్ధికి వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. చదువుతోపాటు క్రీడలు, యోగా, కరాటే వంటి అంశాలను ఐచ్ఛికంగా నేర్చుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు జిల్లాలో పది పాఠశాలలను మొదటి విడత కింద ఎంపిక చేసి సంబంధిత పరికరాలను స్కూళ్లకు పంపిణీ చేశారు. విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వారంలో ఒకరోజు సంగీతం నేర్చుకోనున్నారు. తద్వారా వారికి శ్రవనానందంతోపాటు, ఏకాగ్రత పెరగనుంది. సంగీత సాధనతో వివిధ రకాలైన కళల్లో ప్రావీణ్యం పొందనున్నారు. పిల్లలు వాటిని నేర్చుకునేందుకు మరింత ఆసక్తి చూపనున్నారు. సంగీత సాధనతో టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్‌లో ఆయా వృత్తుల్లో కూడా స్థిరపడేందుకు ఉపకరిస్తుంది.

శిక్షకులు వస్తే ప్రయోజనం

పాఠశాలలకు సంగీత వాయిద్యాలు అంది నెల రోజులు అవుతోంది. విద్యార్థులతో సాధన చేయించే శిక్షకులను ఇంకా నియమించలేదు. అన్ని రకాల వాయిద్యాలు తెలిసిన వారు అరుదుగా ఉంటారు. ఒక్కో దాంట్లో ఒక్కొక్కరికి ప్రావీ ణ్యం ఉంటుంది. ఇలాంటి వారిని ఎంపిక చేయడం సులభమే. అన్ని తెలిసిన వారికి రూ.10 వేల గౌరవ వేతనం సరిపోతుందని ప్రభుత్వం భావిస్తోంది. భిన్నరంగాల్లో ప్రతిభ ఉన్న ఇద్దరిని నియమించి వేతన సర్దుబాటు చేస్తే పరిష్కారం లభిస్తుందని పలువురు అంటున్నారు. సంగీత పా ఠాలు బోధించడంలో ఇప్పటికే ఆలస్యమైంది. వెంటనే సంగీత ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తయితే సంగీత పాఠాలు బోధించేందుకు ఆస్కారం ఉంటుంది.

పరికరాల పంపిణీ

జిల్లాలో పీఎంశ్రీ కింద 10 పాఠశాలకు సంగీత పరికరాలను పంపిణీ చేశారు. డోలక్, తబల, హర్మోనియమం, డ్రమ్స్, వయోలిన్ వంటివి అందించారు. వీటిని 6–10వ తరగతి చదివే విద్యార్థులతోపాటు, కేజీబీవీ, గురుకుల, మోడల్‌స్కూళ్లలో ఇంటర్ విద్యార్థులకు నేర్పించనున్నారు.

కళలను ప్రోత్సహించడం హర్షణీయం



పిల్లలకు చదువుతో పాటు, వివిధ కళలను నేర్పించడం హర్షణీయం. చిన్నతనం నుంచి సంగీతం నేర్చుకోవడం ద్వారా దేశ సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి. సంగీతంతో మనసు ఆహ్లాదకరంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. పాఠశాలలకు విస్తరించడం స్వాగతిస్తున్నాం.

– చెన్నాడి వెంకటరమణరావు, కవి


ప్రతిభను వెలికితీసేలా



ప్రభుత్వ పాఠశాలల్లో సంగీతం నేర్పించడం ద్వారా వారిలో ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుంది. బోధనతో అలసటకు గురయ్యే పిల్లలు సంగీతంతో మరింత ఉత్సాహంగా ఉంటారు. ప్రస్తుతం అనేక పాఠశాలల్లో టీచర్లు పాఠాలను కథలు, గేయాల రూపంలో చెబుతూ తోడ్పాటు అందిస్తున్నారు.

– రవి, ప్రిన్సిపల్, గొల్లపల్లి మోడల్‌స్కూల్

పరికరాలు వచ్చాయి



పీఎంశ్రీ పథకం కింద జిల్లాలోని ఎంపిక చేయబడిన పాఠశాలలకు మొదటి విడత కింద సంగీత పరికరాలను పంపిణీ చేశారు. దీనికి సంబంధించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం. వారానికో పీరియడ్ సంగీతం, వాయిద్యాలపై శిక్షణ ఇచ్చేందుకు టైంటేబుల్ ఏర్పాటు చేస్తున్నాం.

– రాము, డీఈవో

క్లుప్తంగా

కొత్తబస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం కనిపించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడ బస్ ప్లాట్‌ఫాం సమీపంలోని మరుగుదొడ్ల పక్కన వ్యక్తి మృతదేహం ఉందని, బూడిద రంగు టీషర్ట్, తెల్లపంచ కట్టుకుని ఉన్నాడని, మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. అతని సమాచారం తెలిసినవారు 87126 56815నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


శ్రావ్య(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శంకరపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రావ్య (27)కు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లికి చెందిన అమ్మిగల్ల ధర్మతేజ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కొడుకు శ్రేయాన్స్‌నందన్ ఉన్నాడు. ధర్మతేజ్ రెండేళ్లక్రితం దుబాయ్ వెళ్లాడు. అప్పటినుంచి శ్రావ్య పుట్టింట్లో ఉంటోంది. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి ధర్మతేజ్ శ్రావ్యతో వీడియోకాల్‌లో మాట్లాడాడు. ఇద్దరిమధ్య గొడవ జరగడంతో మంగళవారం వేకువజామున ఇంట్లో శ్రావ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రావ్య సోదరుడు గొట్టె శివకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మానసికవేదనతో ఒకరు..

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన బల్ల బాలయ్య(50) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గుండె సంబంధిత ఆపరేషన్ సైతం జరిగింది. కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురవుతూ.. మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడకు చెందిన చిన్నారి జెట్టి మాన్విక్‌పై మంగళవారం కుక్కలు దాడి చేశాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విక్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడికి పలుచోట్ల గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని మొదట స్థానిక ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు.

ఆటో బోల్తా ఘటనపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో మంగళవారం స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తా పడిన సంఘటనపై విద్యార్థి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన మహమ్మద్ షబానా బేగం–రఫీక్ దంపతుల కుమారుడు మహమ్మద్ హర్షద్ రిజ్వాన్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. నిత్యం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన షేక్ మలాన్ ఆటోలో స్కూల్‌కు వెళ్లివస్తుంటాడు. అదే ఆటోలో మరో పాఠశాలకు చెందిన విద్యార్థులు వెళ్తుండడంతో వారిని ఆ స్కూల్‌లో దింపేందుకు ఎల్లారెడ్డిపేట శివారులోని గాయత్రి డిగ్రీ కాలేజీ ఎదుట ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హర్షద్ రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెకు సౌరవెలుగులు

- సోలార్ పవర్ ఉత్పత్తిపై గ్రామీణుల ఆసక్తి
- విద్యుత్ చార్జీల ఆదా.. అదనపు ఆదాయం
- పీఎం సూర్యఘర్ స్కీంకు పెరుగుతున్న డిమాండ్


ఉప్పట్లలో భవనంపై అమర్చిన సోలార్ ప్యానెల్స్

మంథనిరూరల్: ఆధునిక సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెదుతోంది. దీనిని సొంతం చేసుకోవడంలో పల్లెవాసులూ ఆసక్తిచూపుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటివరకు పట్టణాలకే పరిమితమైన సోలార్ పవర్ తయారీ, వినియోగం పద్ధతులు గ్రామాలకూ విస్తరిస్తున్నాయి. విద్యుత్ చార్జీల భారం తగ్గించుకునేందుకు పల్లెప్రజలు సోలార్ పవర్‌పై ఆసక్తి చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ ప్యానెల్స్ అమర్చుకుంటున్నారు.

ఇంటికి 300 యూనిట్లు ఉచితం..

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సోలార్ సిస్టం అమర్చుకుంటే ఇంటికి 300 యూనిట్లు ఉచితంగా అందించేలా రూపకల్పన చేశారు. దీంతో విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు.

చార్జీల ఆదా.. అదనపు ఆదాయం..

సోలార్ పవర్ తయారీ సిస్టమ్ అమర్చుకుంటే ప్రస్తుత విద్యుత్ చార్జీలు ఆదా అవుతాయి. ఈ ప్యానెల్స్ ద్వారా నెలకు 300 యూనిట్ల నుంచి 500 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందులో 200 – 300 యూనిట్ల వరకు గృహావసరాలకు వినియోగించుకోవాలి. మిగిలిన విద్యుత్‌ను ఎన్పీడీసీఎల్ ఒక్కో యూనిట్‌కు రూ.4 చెల్లించి కొనుగోలు చేస్తుంది. ఒకవైపు విద్యుత్ చార్జీల భారం తగ్గడం, మరోవైపు విద్యుత్ విక్రయం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుండడంతో పల్లెవాసులు తమ ఇళ్లపై సోలార్ పవర్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

కేంద్రప్రభుత్వం నుంచి రాయితీ..

కేంద్రప్రభుత్వం గతేడాది ప్రవేశ పెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రాయితీ వర్తింపజేస్తోంది. 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ సిస్టం అమర్చుకుంటే రూ.78 వేలు, 2 కిలో వాట్లు అయితే రూ.60 వేలు, ఒక కిలోవాట్ అయితే రూ.30 వేల వరకు సబ్సిడీ అందిస్తోంది. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, నెలసరి విద్యుత్ బిల్లు, ఇంటి యజమాని ధ్రువీకరణ పత్రం ఉంటే చాలు. దరఖాస్తు ఆమోదం తర్వాత ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ అమర్చుతారు.


సోలార్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే సిస్టం

కరెంట్ చార్జి తగ్గుతుంది



రోజురోజుకూ కరెంట్ చార్జీలు పెరుగుతున్నయ్. ఎండకాలంలో రూ.వేలకు వేలు కట్టాల్సి వస్తోంది. కరెంటు చార్జీల భారం తగ్గుతుందనే ఆలోచనతో సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్న. ప్రస్తుతం బాగానే పనిచేస్తుంది.

– ముత్యాల లింగయ్య, ధర్మారం, మంథని

అదనపు ఆదాయం



గృహావసరాలకు ఉచితం. అదనపు ఆదాయం వస్తుందనే ఆలోచనతో సోలార్ సిస్టం తీసుకున్న. సబ్సిడీ కూడా వస్తుంది. ఇంట్లో మేం వాడుకోగా మిగిలిన సోలార్ కరెంట్‌ను అధికారులు తీసుకుని మాకు పైసలు ఇస్తున్నరు.

– బడికెల సతీశ్, ఉప్పట్ల, మంథని

ఘనత సాధించిన తండ్రీకొడుకులు

- యూరప్‌లో ఎత్తయిన శిఖరం అధిరోహణ
- అభినందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష


వివేకానందరెడ్డి, మహిపాల్‌రెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ 5,642 మీ ఎత్తు (18,150 అడుగులు) పర్వతశిఖరాన్ని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన వివేకానందరెడ్డి, ఆయన తండ్రి మహిపాల్‌రెడ్డి అధిరోహించారు. దీంతో కలెక్టరేట్‌లో మంగళవారం తండ్రీకొడుకులను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.

తండ్రిబాటలో తనయుడు..

మాజీ సైనికోద్యోగి అయిన లెంకల మహిపాల్‌రెడ్డి ఇప్పటికే పలు దేశాల్లోని 12 పర్వతాలను అధిరోహించి ఇంటర్నేషనల్ మౌంటనీర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. తన బాటలోనే తనయుడు వివేకానందరెడ్డిని కూడా పర్వతారోహకుడిగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో గతేడాది శిక్షణ ఇచ్చారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని పతాల్సు పర్వతాన్ని వివేకానందరెడ్డి అధిరోహించారు. తండ్రి ఇచ్చిన శిక్షణతోనే యూరప్‌లో అత్యంత ఎత్తయిన పర్వతాన్ని ఈనెల 3న అధిరోహించారు.

సే నో టు డ్రగ్స్ బ్యానర్ ఆవిష్కరణ

యూరప్‌లోని పర్వతాన్ని అధిరోహించిన వివేకానందరెడ్డి.. అక్కడ సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్ ఆవిష్కరించారు. గతనెల 28న రష్యాకు చేరుకుని అక్కడే ఐదురోజుల పాటు శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలోనూ మాస్టర్ వివేకానందరెడ్డి ధైర్యసాహసాలతో పర్వతాన్ని అధిరోహించడం అభినందనీయమని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించి తెలంగాణ రాష్ట్రానికి, భారతావనికి కీర్తిప్రతిష్ఠలు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

భూవివాదంతోనే వృద్ధుడి హత్య

- ఇద్దరు నిందితుల అరెస్టు
- మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్

మల్లాపూర్: భూ వివాదంతోనే మండలంలోని వేంపల్లికి చెందిన వృద్ధుడు సకినపెల్లి కాశీం(60)ను హత్యచేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్యలో నిందితులైన నానం హన్మాండ్లు, ఆయన కుమారుడు నానం రాకేశ్‌ను అరెస్టు చేశారు. సంఘటన వివరాలను మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. హన్మాండ్లు 15ఏళ్ల క్రితం కొన్న భూమి పక్కనున్న బావిని పూడ్చేందుకు ప్రయత్నించారు. దీనికి కాశీం అడ్డుపడ్డాడు. అప్పటినుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాశీం బాత్‌రూం విషయంలోనూ గొడవ జరుగుతోంది. పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. దీంతో కాశీంను హత్య చేయాలని హన్మాండ్లు, రాకేశ్ నిర్ణయించుకున్నారు. కాశీం అతడి పెద్ద కుమారుడి ఇంట్లో భోజనం చేసి వెళ్తుండగా అప్పటికే సిద్ధం చేసుకున్న కర్రతో ఈనెల 2న రాత్రి 7.30 గంటల సమయంలో దాడి చేశారు. కాశీం మృతి చెందిన తర్వాత హన్మాండ్లు, రాకేశ్ బైక్‌పై పరారయ్యారు. కాశీం కుమారుడు లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం గోధూర్ చౌరస్తాలో నిందితులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యకు ఉపయోగించి కర్ర, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- క్వారీ యజమాని, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: ఇసుక లారీ ఢీకొని చనిపోయిన మానకొండూర్ మండలం మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ప్రమాదానికి కారణమైన ఊటూరు ఇసుకక్వారీ యజమానులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై కేసు నమోదు చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో మంగళవారం మాట్లాడుతూ.. కెక్కర్ల సురేశ్ కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండేవాడన్నాడు. పోచంపల్లి వద్ద ఇసుక లారీని ఢీకొని చనిపోయాడని తెలిపారు. సురేశ్‌ను అంబులెన్సులో కరీంనగర్ తీసుకెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. రహదారి వెంట ఇసుక లారీలు నిలిపేందుకు ఎవరు అనుమతి ఇచ్చారని మండిపడ్డారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం పరామర్శించలేదన్నారు. మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, నెల్లి శంకర్, గుర్రం కిరణ్ గౌడ్, గడ్డం సంపత్, నెల్లి మురళి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు మృతి

- మృతుల నేత్రాలు దానం
- ఆరుగురు అంధులకు చూపు


అమృత్‌లాల్ చౌడ(ఫైల్)


తాండూరి శ్రీనివాస్(ఫైల్)


వెల్పుల సాయిలు(ఫైల్)


తాండూరి శ్రీనివాస్ కుటుంబాన్ని ఓదార్చుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో సోమవారం రాత్రి ముగ్గురు గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో కూడా ఆ మూడు కుటుంబాలు.. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో ముగ్గురి నేత్రాలను దానం చేశారు. ఆరుగురు అంధులకు కంటి వెలుగులు ప్రసాదించేలా సహకరించారు. ఈ ముగ్గురిలో సమీప బంధువు తాండూరి శ్రీనివాస్ పార్థివదేహాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముగ్గురి చూపు.. ఆరుగురికి కంటి వెలుగులు..

జవహర్‌నగర్‌కు చెందిన తాండూరి శ్రీనివాస్(49) సింగరేణిలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో స్టెనోగా పనిచేస్తున్నాడు. ఛాతీలో నొప్పి ఉందంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే గోదావరిఖని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. శ్రీనివాస్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా నివాళి అర్పించారు. అదేవిధంగా దుర్గానగర్‌కు చెందిన సీనియర్ వ్యాపారి అమృత్‌లాల్ చౌడ(78) హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 55 ఏళ్లుగా హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. మృతుడి నేత్రాలను కుమారుడు, కోడలు జయప్రకాశ్ చౌడ–కవిత, మనమలు కౌశల్, నివేద్ దానం చేశారు. మరోవైపు.. ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి వేల్పుల సాయిలు(70) సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతుల కుటుంబాలను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్, స్ఫూర్తి క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

దైవదర్శనానికి వెళ్లి తిరిగొస్తూ..

- ఐలాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం
- చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు


గాడిపెల్లి నరేశ్ (ఫైల్)


చెట్టును ఢీకొట్టిన కారు

కోరుట్లరూరల్: దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని అయిలాపూర్ శివారులో మంగళవారం ఉదయం నాలుగు గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. అయిలాపూర్‌కు చెందిన గాడిపెల్లి నరేశ్ (36) కొంతకాలంగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 20రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. ఇంట్లో పండగలన్నీ చేసుకున్నారు. ఈనెల 10న తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. సోమవారం ఉదయం తోడళ్లుడు బొల్లపెల్లి శ్రీనివాస్ కారులో రెండు కుటుంబాలు కలిసి యాదగిరి, స్వర్ణగిరి ఆలయాలను దర్శించుకున్నారు. రాత్రిసమయంలో తిరుగు పయణమయ్యారు. రెండు నిమిషాలైతే ఇంటికి చేరేదే.. ఆలోపే అయిలాపూర్ శివారు సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బొల్లెపల్లి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ భార్య సుజాతకు రెండు కాళ్లు, ఓ చేయి విరిగింది. నరేశ్ భార్య సరితకు రెండు చేతులు విరిగాయి. నరేశ్ కుమారుడు, కూతురు, శ్రీనివాస్ కూతురును జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. నరేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వినూత్నంగా.. ఉపాధి పక్కాగా..

- కుర్తాలు, లాల్చీల తయారీ
- మరో నలభై మందికి ఉపాధి
- స్వయంకృషితో రాణిస్తున్న మధు





సిరిసిల్లకల్చరల్: పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి.. అని పెద్దలు చెప్పిన మాటలను నమ్మి ముందుకెళ్లి విజయం సాధించాడు భైరి మధు. తన తప్పేమి లేకున్నా చేస్తున్న వ్యాపారంలో నష్టం రాగా.. అదే రంగంలో వినూత్నంగా ఆలోచించి ఉపాధి పక్కాగా చేసుకున్నాడు. మరో 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన మధు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం భీవండిలో స్థిరపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరిగి సిరిసిల్ల సమీపంలోని చంద్రంపేటకు వచ్చాడు. తన రెక్కల కష్టంతో రెండు కార్ఖానాలు నిర్వహించే స్థాయికి ఎదిగాడు. అయితే కరోనా మహమ్మారి కారణంగా నష్టపోయాడు. పడిన చోటే తిరిగి లేవాలని భావించి.. చేనేత రంగంలోని వినూత్నంగా ఆలోచించాడు. ఇప్పుడు 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

కరోనాతో కొత్త జీవితం

కరోనా నియంత్రణకు మాస్కులు ధరించడం తప్పనిసరైన నేపథ్యంలో మాస్కుల తయారీపై దృష్టి సారించిన మధు కరీంనగర్, వరంగల్ జిల్లాల వరకు సరఫరా చేశాడు. సంక్షోభం ముగిసి సమాజం సాధారణ స్థితికి చేరేసరికి మధుకు ప్రత్యామ్నాయ వ్యాపారం జాడ దొరికింది. జాతీయ జెండాల రూపకల్పన, బ్యానర్లతోపాటు పండుగల సందర్భంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న కండువాలు తయారు చేయడం ప్రారంభించాడు. గత ఐదేళ్లుగా వస్త్రం కొనుగోలు చేయడం, రంగులు అద్దించడంతోపాటు వాటిని ఆర్డర్ల మేరకు కండువాలు, తయారు చేయిస్తున్నాడు. కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి సామూహిక ఉత్సవాల్లో ఉపయోగించే లాల్చీలు, కుర్తాలు కుట్టించి విక్రయిస్తున్నాడు. వివాహాది శుభకార్యాల సందర్భంగా ఆయా కార్యక్రమాల నిర్వాహకులు ఏకరీతిగా ఉండే కుర్తాలు ధరిస్తుంటారు. అదే అదనుగా హల్దీ, సంగీత్ వంటి ఉత్సవాలకు అవసరమైన కుర్తాలు తయారు చేయించి అమ్ముతున్నాడు.

మరో 40 మందికి ఉపాధి

మధు తాను ఉపాధి పొందడంతోపాటు మరో 40 మందికి కుర్తాలు కుట్టే పనిలో ఉపాధి ఇస్తున్నాడు. ఒక్కొక్కరు వారి పని తీరు ఆధారంగా రోజుకు కనీసం రూ.300 సంపాదిస్తున్నారు. మధు చేస్తున్న పనికి ఆయన సతీమణి శ్యామల సైతం తోడుగా నిలుస్తోంది.

కరోనా నేర్పిన దారి



కోవిడ్ మహమ్మారి కారణంగా చేస్తున్న వ్యాపారం నష్టపోయాను. మాస్కులు ధరించడం తప్పనిసరి అనే ప్రచారంతో మాస్కులు తయారు చేయించి ఊరూరూ తిరిగి అమ్మేవాన్ని. టీవీఎస్ ఎక్సెల్ బండిమీద పలు జిల్లాల్లో మాస్కులు విక్రయించాను. మెల్లగా కరోనా పీరియడ్ తరువాత ఈ కుర్తాలు, జెండాలు, కండువాలు తయారు చేయించి విక్రయిస్తున్నాను.

– భైరి మధు, తయారీదారుడు

కొన్నేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా



కొంతకాలంగా కుర్తాలు, లాల్చీలు కుట్టడం కోసం ఇక్కడే పనిచేస్తున్నాను. రోజుకు 30 నుంచి 40 వరకు లాల్చీలు కుట్టగలుగుతున్నాను. రోజుకో రూ.400 చొప్పున నెలకు రూ.12వేలు వరకు ఆదాయం వస్తోంది.

– సిరిపురం లక్షణ

ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థి మరియం భాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు పీడీ సుంకరి మురళీధర్ తెలిపారు. ఈ నెల 3న స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి ప్రథమ బహుమతి, రూ.10వేల నగదు గెలుచుకున్నట్లు వివరించారు. మంగళవారం విద్యార్థిని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ అభినందించారు.

అంజన్న సన్నిధిలో శ్రావణ సందడి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


సామూహిక అభిషేకాలు చేస్తున్న భక్తులు


వీల్‌చైర్‌లో అంజన్న దర్శనం కోసం వస్తున్న భక్తురాలు


ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సామూహిక అభిషేకాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. టికెట్లు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.4.56లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.